క్లుప్తంగా

2, 3 తేదీల్లో మెగా గృహ రుణ మేళా

కంకిపాడు: వినియోగదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు భారతీయ స్టేట్ బ్యాంక్ ముందుంటుందని, మార్చి 2, 3 తేదీల్లో బ్రాంచ్ వద్ద మెగా గృహ రుణ మేళా నిర్వహించనున్నట్లు బ్యాంకు కంకిపాడు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఏవీవీఎస్ ప్రకాష్‌రావ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు సేవలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఖాతాదారులకు ఇంటి నిర్మాణం, గృహాల కొనుగోళ్లపై ప్రత్యేకంగా రుణాలు అందించేందుకు రుణమేళా నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంకు ఖాతాదారులు, పట్టణ ప్రజలు రుణ మేళాను సద్వినియోగం చేసుకుని రుణాలను పొందాలని చీఫ్ మేనేజర్ ప్రకాష్‌రావ్ కోరారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

రామవరప్పాడు: మహా శివరాత్రిని పురస్కరించుకుని జననీ థెరీసా సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో సుమారు 100 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినాన ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సేవా సంస్థ చైర్మన్ బోయిన వెంకటేశ్వరమ్మ పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అద్దేపల్లి సాంబశివనాగరాజు, నభిగాని కొండయ్య, బొమ్మసాని అరుణ, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పెనమలూరు: కృష్ణా–గంటూరు పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండగా యనమలకుదురులో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా గ్రామంలో పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, రాజకీయ పార్టీల పాటలు పెట్టరాదని అధికారులు మైకుల్లో ప్రకటనలు చేశారు. అయితే ఆచరణలో మాత్రం అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేయలేదు. యనమలకుదురు గ్రామంలో మండపం సెంటర్, డొంక రోడ్డు పలు ప్రాంతాల్లో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సినీనటుడు నందమూరి బాలకృష్ణతో పాటు పలువురు నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టారు. బహిరంగంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగినా అధికారులు ఎవ్వరు చర్యలు తీసుకోలేదు.

రోగులకు ఆర్థిక సాయం

గన్నవరం: అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పేదలకు గన్నవరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. బుధవారం మానవతా అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి నేతృత్వంలో సభ్యులు స్వయంగా బాధితుల ఇళ్లకు వెళ్లి ఆర్థి సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. వీరిలో సెల్యులాయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న కొచ్చెరకోట్ల వీరరాజశేఖర్‌కు రూ. 5 వేలు, థైరాయిడ్ బాధితుడు పొదిలి రామకృష్ణకు రూ. 5 వేలు, మరో ఐదుగురికి నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేసినట్లు మదుపల్లి తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమకు సహకారం అందించిన మానవతా బృందానికి బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. సంస్థ కార్యదర్శి కర్రా వరప్రసాద్, కోశాధికారి పొట్లూరి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి వీసం ప్రసాదరావు, ఎగ్జిక్యూటివ్ హెల్త్ మామిడి రాధిక, సభ్యులు పాల్గొన్నారు.

తేలప్రోలులో ఆయుర్వేద వైద్య శిబిరం

ఉంగుటూరు: తేలప్రోలు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శివాలయం వద్ద ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో పరిష్కారం లభిస్తుందని, మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్లు టి.లక్ష్మిసౌజన్య, జయలక్ష్మి, పుష్పజా, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభంజనం..
యనమలకుదురులో ఊరేగుతున్న దేవుడి ప్రభ



ప్రభోత్సవంలో బేతాళ నృత్యాలు చేస్తున్న కళాకారులు



ప్రభోత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని



యనమలకుదురులో స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

భజేహం.. భోళా శంకరం

వైభవంగా రామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాలు

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తుల సందడితో శివగిరి ఉత్సవ శోభను సంతరించుకుంది. భక్తులు బుధవారం మహాశివరాత్రి పర్వదినంతో వేకువ జామునే కొండపై వేంచేసి ఉన్న స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసి, పితృదేవతలకు పిండ ప్రదానం చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకం, బిల్వార్చన, శ్రీ పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. భక్తులకు ఉచితంగా ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. భక్తుల కోసం ప్రత్యేంగా అత్యాధునిక తాగునీరు యంత్రం ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు ఉచితంగా అందజేశారు. వృద్ధులు, వికలాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. ఈ సంవత్సరం కొండపైనే పార్కింగ్ వసతి కల్పించారు. అయితే స్వామివారి దర్శనానికి భక్తులు చాలా సమయం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండటంతో సామాన్య భక్తులు ఇబ్బందులు పడ్డారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు..

మొక్కులు తీరిన భక్తులు గండదీపంతో కొండ పైకి మండుటెండలో చేరుకున్నారు. భక్తులు తలపై గండదీపం పెట్టుకుని నేలపై చీరలు పరిచి కొండ చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆ తర్వాత కొండపైకి మెట్ల మార్గం ద్వారా చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే బోడెప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, జిల్లా ఎస్పీ గంగాధర రావు, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు ఉన్నారు.

సందడిగా ప్రభోత్సవం..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ప్రభోత్సవం ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటలకు రాతిచక్రాల రథంపై ఏర్పాటు చేసిన దేవుడి ప్రభ కొండ చుట్టూ ఊరేగించారు. గ్రామంలో దాదాపు 50 ప్రభలు రంగురంగు కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండపం సెంటర్లో 70 అడుగుల ప్రభ ఏర్పాటు చేశారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. దేవుడి ప్రభతో పాటు గ్రామంలో మిగతా ప్రభలు కూడా డప్పులు కొడుతూ, డీజేలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



యనమలకుదురులో శ్రీరామలింగేశ్వరస్వామి



గండదీపంతో మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న భక్తులు



కనులపండువగా కల్యాణం..

శ్రీరామలింగేశ్వరస్వామివారి దివ్య కల్యాణం అర్ధరాత్రి 2.16 గంటలకు కనుల పండువగా జరిగింది. గ్రామంలోని మండపంలో అర్ధరాత్రి అయోధ్య శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మ పుణ్యదంపతులతో ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ స్వామివారి కల్యాణం ఘనంగా చేశారు. నేడు గ్రామంలో గ్రామోత్సవం జరుపుతారు.

ప్రభోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శరణు శశిశేఖరా

హర నామ స్మరణతో మార్మోగిన శివాలయాలు



తేలప్రోలులో నందీశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



ఉయ్యూరు శివాలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



బాపులపాడులో శ్రీశైల మల్లికార్జున స్వామి



రామవరప్పాడులో స్వామివారు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఐటీఐ రోడ్డులోని భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం, పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానం, కానుమోలులోని గంగా, బాలా త్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు జరిపారు. పెరికీడులోని ముక్తేశ్వరాలయంలో ఏకవారాభిషేకం, శాంతి కల్యాణం, లింగోద్భవకాల అభిషేకాలు వైభవోపేతంగా జరిగాయి. ప్రముఖ నాట్యకారిణి పసుమర్తి శ్రీవల్లి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన, బ్రహ్మశ్రీ హరి శ్రీనివాస శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనం 'శివరాత్రి మహాత్యం' భక్తులను విశేషంగా అలరించాయి.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

ఉంగుటూరు: తరిగొప్పలలో ఉన్న దుర్గా మల్లికార్జున దేవస్థానంలో శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అలాగే తేలప్రోలులో విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు, కుంకుమ పూజలు, నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు వైభవంగా నిర్వహించారు.

శైవక్షేత్రాల్లో శివనామస్మరణ

ఉయ్యూరు: మహాశివరాత్రి పర్వదినాన శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉయ్యూరు, పెద ఓగిరాల, ముదునూరు, కాటూరు శివాలయాల్లో బుధవారం వేకువజాము నుంచే పరమశివుడి దర్శనానికి బారులుతీరారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉయ్యూరు శివాలయంలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం అర్చకులకు స్వయంపాకం అందించి ఆశీర్వచనాలు పొందారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గన్నవరం రూరల్: ముస్తాబాద కొండపైనున్న రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గుహాలయంలో రామలింగేశ్వరుడిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రామలింగేశ్వర స్వామిని దర్శించి పూజలు చేశారు. వేలాది మందికి అన్నదానం చేశారు. చిక్కవరం కొండపైనున్న బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించి బ్రహ్మయ్యలింగం చెరువులో భక్తులు స్నానాలను ఆచరించి, పితృలకు తర్పణలు సమర్పించారు.

హరహర మహాదేవ..

రామవరప్పాడు: రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయ ప్రాంగణంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, ఎనికేపాడు, నిడమానూరులోని శివాలయాలు ఉదయం నుంచే భక్తులతో కిక్కిరిశాయి. రామవరప్పాడు శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వస్వామి ఆలయంలో స్వామివారిని రకారకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నాభిషేకం నిర్వహించారు. రాత్రి 10.30 గంటలకు స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక మాట్లాడుతూ భక్తుల రద్దీను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో ఏర్పాట్లు కల్పించామన్నారు. గురువారం ఉదయం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

వైభవంగా శాంతి కల్యాణ మహోత్సవం



గన్నవరంలో ఆది దంపతులకు కల్యాణం జరుపుతున్న అర్చకులు

గన్నవరం: మహాశివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి దివ్యశాంతి కల్యాణాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వరపూజ, అఖండ దీపప్రజ్వలన, రుద్రాభిషేకాలతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి చెరకు, తేనెతో కలిపిన డ్రై ఫ్రూట్స్‌తో అభిషేకాలు, ఆది దంపతులకు లక్షపుష్పార్చన జరిపారు. సాయంత్రం 6.30 గంటలకు సుముహూర్తంలో ఆది దంపతులకు శాంతి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పది వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. అర్ధరాత్రి 12.01కు లింగోద్భవ కాలంలో స్వామివారికి అన్నాభిషేకం జరిపారు. దావాజిగూడెంలోని శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, శ్రీవల్లిదేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. కేసరపల్లిలో శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయం, గుమ్మడి క్షేత్రంలోని శివాలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు.



ముస్తాబాద ఆలయంలో కోలాటం చేస్తున్న భక్తులు

పుణ్య స్నానం.. భక్తి పరవశం



మద్దూరు ఏటిపాయలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కృష్ణా తీరానికి పోటెత్తిన భక్తులు

కంకిపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మద్దూరు ఏటిపాయలో పుణ్యస్నానాలకు భక్తజనం పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలతో ఏటిపాయ కిక్కిరిసింది. ఏటి ఒడ్డున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసి, అనంతరం పుణ్యస్నానం ఆచరించి ఏటి ఒడ్డున ఉన్న రుద్రేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. సుమారు 50 వేల మందికి పైగా భక్తులు ఏటి పాయలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు సమాచారం. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా మద్దూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పుష్కరఘాట్‌లో వసతులు సమకూర్చారు. అత్యవసర పరిస్థితుల్లో పడవలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసుకునేందుకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా టెంట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే ప్రత్యేక విభాగాలను అందుబాటులో ఉంచారు. ఏర్పాట్లను సర్పంచ్ చిప్పల రామదాసు, పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు. బందోబస్తును ఎస్‌ఐ డి.సందీప్ పరిశీలించారు. మండలంలోని అన్ని శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, విశిష్ట పూజా కార్యక్రమాలు జరిపించారు.

కృష్ణా నదిలో పుణ్యస్నానాలు..

పెనమలూరు: మండల పరిధిలో బుధవారం పవిత్ర కృష్ణానదిలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు. యనమలకుదురు ఘాట్‌లో నీరు లేకపోవటంతో దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో గుంటూరు జిల్లాలో ఉన్న కృష్ణానది పాయ వద్దకు వెళ్లి భక్తులు పుణ్యస్నానాలు చేశారు. పెదపులిపాక, చోడవరం ఘాట్‌లలో నది స్నానాలు చేయటానికి ఆయా గ్రామ పంచాయతీలో సౌకర్యాలు కల్పించారు. పెదపులిపాకలో భక్తులకు జల్లు స్నానం చేయటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు.



యనమలకుదురులో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కిటకిటలాడిన శివాలయాలు..

పెనమలూరు, చోడవరం, పోరంకి, తాడిగడప, కానూరు, వణుకూరు శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శివలింగానికి పాలు పోసి పూజలు నిర్వహించారు. అనంతరం దీపారాధన చేశారు. ఆయా ఆలయాలలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో ప్రణవి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖ అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. కాగా పెనమలూరు హైస్కూల్ సెంటర్‌లో త్రిమూర్తి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి 5 వేల మంది భక్తులను అన్న సమారాధన నిర్వహించారు.



మద్దూరు ఏటిపాయలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్న భక్తజనం

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కంకిపాడు/ఉయ్యూరు/పెనమలూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల పోలింగ్ ప్రక్రియ ఈనెల 27న నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయ కేంద్రంగా పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమం బుధవారం పూర్తి చేశారు. డివిజన్ పరిధిలో పామర్రు నియోజకవర్గంలో గల పామర్రు, తోట్లవల్లూరు, మొవ్వ, పమిడిముక్కల మండలాలు, పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలు ఉన్నాయి. డివిజన్ వ్యాప్తంగా 21,119 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. పామర్రు నియోజకర్గ పరిధిలో 5,624 మంది ఓటర్లు ఉన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో 15,495 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,498 మంది, మహిళలు 6,995 మంది, ఇతరులు ఇద్దరు ఓటు హక్కు కలిగి ఉన్నారు. మండలాల వారీగా పెనమలూరు 10,594 మంది ఓటర్లు, కంకిపాడు 2,096 మంది ఓటర్లు, ఉయ్యూరు 2,805 మంది ఓటర్లు ఉన్నారు.

25 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు..

ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా డివిజన్ వ్యాప్తంగా 25 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో 8 కేంద్రాలు, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో మూడేసి పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. తోట్లవల్లూరు, పామర్రు, మొవ్వ, పమిడిముక్కల మండలాల్లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఐదుగురు పోలింగ్ సిబ్బందిని నియమించారు. మూడు సెక్టార్లుగా విభజించి ఆయా కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని ఉయ్యూరు మార్కెట్‌యార్డులో గల ఆర్‌డీఓ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటరు నుంచి సామగ్రి పంపిణీ చేశారు. ఎస్పీ ఆర్.గంగాధర్ రావు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది ఆయా కేంద్రాల వద్ద బందోబస్తు చర్యలను చేపట్టారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.

గన్నవరంలో సర్వం సిద్ధం..

గన్నవరం/హనుమాన్‌జంక్షన్ రూరల్: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 14 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు వద్ద ఓటర్ల సౌకర్యార్థం టెంట్లు, తాగునీటి సదుపాయం, ర్యాంప్‌లను సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 12,271 మంది పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో గన్నవరం మండలంలో 3,528, బాపులపాడులో 2,628, ఉంగుటూరులో 1,234, అత్యధికంగా విజయవాడ రూరల్ మండల పరిధిలో 4,881 మంది ఓటర్లు ఉన్నారు.

స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

– కలెక్టర్ డీకే బాలాజీ

ఉయ్యూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఉయ్యూరు ఆర్‌డీఓ కార్యాలయంలో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను బుధవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ విధులపై సూచనలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛా యుతంగా, పారదర్శకంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందించి ఆయా కేంద్రాలకు పంపించామన్నారు. ఆర్‌డీఓ హెలా షారోన్, ఏఓ భద్రునాయక్, తహసీల్దార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.